


# బాసు-ఒహాసు

శేఖమూరి శ్రీనివాస్

ఓ ఐదు నిమిషాలు మాట్లాడిన అకౌంటెంట్ ధనుంజయ్ ఫోన్ పెట్టేశాక, ''మనకు రెండు రోజుల్లో కొత్త మేనేజర్ గారు రాబోతున్నారు?'' అన్నాడు నీరసంగా. వచ్చిన ఫోన్ హెడ్ ఆఫీస్ నుంచి!

''రానివ్వు... ఖాళీ వున్నప్పుడు ఎవరో ఒకరు రావాలి కదా'' అన్నారు క్లర్క్ మనోహర్, కంప్యూటర్ ఆపరేటర్ వీరాచారి.

''కానీ ఇప్పటి వరకూ మనము వున్నట్లు, వుంటున్నట్లుగా ఇక ముందు కుదరదేమో! ఇప్పటి వరకూ వచ్చిన మన బాసులంతా అధికారుల్లా కాక స్నేహితుల్లా కలిసిపోయారు.'' ధనుంజయ్ గొంతులో ఏదో బాధ వ్యక్తమైంది.

''అందరూ గట్లనే ఉంటర్లే సార్! కొత్త సార్ రానియ్యండ్రి... మస్తు ఖుషీ జేస్తడు. మనమెందుకు ఫికర్‌గావడం.'' అటెండర్ జీవన్ ఎంతో అలవోకగా అన్నాడు.

''నీ మాటలు ధైర్యాన్నిస్తున్నాయిరా... కానీ, వచ్చే మేనేజర్ గారికి చండశాసనుడని పేరు. ఆయన ప్రస్తుతం పని చేస్తున్న బ్రాంచిలో నా ఫ్రెండొకడున్నాడు. వాడు హెచ్చరించాడు నన్ను. అయినా మన పనిని మనం చేసుకుపోతుంటే ఏ అధికారి ఏం చేయగలుగుతాడులే!'' తనకు తాను ధైర్యం చెప్పుకుంటూనే, అందర్ని ధైర్యంగా వుండమన్నాడు ధనుంజయ్.

రెండు రోజులు గడిచాయి. స్టాఫ్ నిరీక్షణ ఫలించింది. కొత్త మేనేజర్ రంగనాథం ఆటోలోంచి దిగి చకచకా ఆఫీసులోకి రాసాగాడు. ఆరడుగుల ఎత్తులో ముదురు గోధుమరంగు సఫారీ, బ్లాక్ గాగుల్స్, నెత్తికి, మీసాలకు రంగుతో నవయువకుడిలా వున్నాడు. మీసాలయితే, మెలితిప్పి నిమ్మకాయల కొరకు ఎదురుచూస్తున్నట్లుంది.

ఆ భారీ విగ్రహాన్ని చూడగానే అందరికీ గుండె వేగం పెరిగింది. ఎవరితోనూ మాట్లాడకుండా వెళ్లి 'మేనేజర్' అని రాసి వున్న గదిలో తన సీట్లో కూర్చున్నాడు రంగనాథం.

స్టాఫ్ చేతుల్లోని పూలదండలు ఫీలయ్యాయి. అందరూ గబగబా ఆయన చాంబర్‌లోకి వెళ్లి దండల్ని అలంకరించబోయారు.

'ఆపండి!' గావుకేక పెట్టాడు రంగనాథం.

ఆ అరుపుకు దడుచుకుని రెండడుగులు వెనక్కి వేశారంతా. ధనుంజయ్ కుర్చీ లాక్కుని కూర్చోబోయాడు. 'స్టాండప్' ఈ సారి కేక తీవ్రత ఇంకా పెరిగింది. అసలే రక్తపోటు, పైగా ఈ కేకతో బెదిరిపోయాడు ధనుంజయ్.

కూర్చోబోతున్నవాడల్లా చప్పున లేచి అటెన్షన్‌లోకొచ్చాడు.

''ఇన్ని రోజులూ మీరెలా మీ ఉద్యోగాలు వెలగబెట్టారో నాకనవసరం. ఈరోజు నుంచి పూర్తి క్రమశిక్షణ, సమయపాలనతో విధులను నిర్వర్తించాలి. దండలేసి, దండాలు పెట్టి మస్కా కొట్టాలని చూస్తున్నారేమో! తోలు తీసేయగలను. నా ఛాంబర్‌లో నా కుర్చీ, టేబుల్ తప్ప వేరే కుర్చీలు వుండకూడదు. అర్ధమైందా?'' రంగనాథం హూంకరించాడు.

ఆ మాటలకు డంగైపోయి సరేనన్నట్లు తలలూపారు.

''ఇక వెళ్లండి మీ మీ పనులు చేసుకోండి అనడంతో అందరూ బయటకి వెళ్లిపోయారు.

రంగనాథం పట్ల ఓ విధమైన స్థిర అభిప్రాయానికి వచ్చారు. ఆయనతో తమాషాలు కాదనుకున్నారు!

ఓ అర్ధగంట గడిచాక ఛాంబర్‌లోంచి బయటకు వచ్చాడు రంగనాథం. అప్పుడే లఘుశంక తీర్చుకునేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లి వున్నాడు వీరాచారి. అతని సీట్ దగ్గరికి వెళ్లి అతని కొరకు వేచి చూశాడు రంగనాథం. ఓ పదినిమిషాల తర్వాత వచ్చిన వీరాచారిని చూస్తూ, ''నా పర్మిషన్ లేకుండా ఎవ్వరూ సీట్లోంచి కదలకూడదు. మీకు ఒకటొచ్చినా, రెండొచ్చినా,(వేళ్లు చూపుతూ)నన్నడిగాకే వెళ్లండి. ఇంకో విషయం... ఒక్క వేలికి రెండు నిమిషాలు, రెండువేళ్లకి పదినిమిషాలు కేటాయిస్తున్నాను. అంతకు మించి ఎంత సమయం గడిచినా నిమిషానికి పదిరూపాయలు ఫైన్'' అని విసవిసా ఛాంబర్‌లోకి వెళ్లాడు.

వీరాచారే కాదు. అందరికీ తత్తర పుట్టింది. మనోహర్ డయాబెటిక్! రోజుకు పదిసార్లు బాత్‌రూమ్‌కు వెళతాడు. రోజు మొత్తం మీద ఐదునిమిషాలు లేటైనా యాభైరూపాయలు ఫైన్! గుండె గుభేల్ మంది. అందరూ మనోహర్ వైపే సానుభూతిగా చూశారు.

సాయంత్రం నాలుగైంది. ఛాంబర్ లోంచి వచ్చిన బెల్‌మోత విని జీవన్ లోపలికెళ్లాడు. మరో నిమిషానికి ముందు రంగనాథం, వెనకాల సూట్‌కేస్‌తో జీవన్ బయటకొచ్చారు.

''నేను ఖచ్చితంగా ఐదుగంటలకు తిరిగి వస్తాను. నేను లేను కదా అని ఇంటికి జారుకున్నారా! ఇంక్రిమెంట్‌కు తిలోదకాలివ్వండి. పోచికోలు కబుర్లాడకుండా వర్క్ ఫినిష్ చేయండి'' హుంకరిస్తూ ఠీవిగా బయటకు వెళ్లాడు రంగనాథం.

పులి మేకల్ని గుహలో వదిలి వెళ్లినట్లుంది. అందరూ ఎంతో రిలాక్స్ ఫీలయ్యారు. అయితే, అదీ కాసేపే! ఐదుగంటలకు తిరిగొస్తానన్న మాట గుర్తొచ్చి బుద్ధిగా పనిచేసుకోసాగారు. ఐదు గంటలు దాటింది... రంగనాథం మాత్రం తిరిగిరాలేదు. తమను బెదిరించడానికే అతనలా చెప్పాడని గ్రహించారంతా.

లంచ్‌బాక్స్, బ్యాగ్ సర్దుకొని ఆఫీసులోంచి అంతా బయటపడ్డారు... ''అందరం కలిసి కాఫీ తాగుదామంటూ'' ప్రపోజ్ చేశాడు మనోహర్.

ఓ కాఫీ షాప్‌లోకి వెళ్లారంతా. కాఫీ తాగుతూనే ఆరోజు జరిగిన ఘటలనన్నింటినీ విశ్లేషించారు. రంగనాథం రోజూ ఇలాగే వుంటే కష్టమని భావించారు.

''కొత్త కదా! కొద్దిరోజులు అలాగే వుంటాడు. తర్వాత మామూలుగా వుంటాడులే'' వీరాచారి భరోసాగా అన్నాడు.

''కొత్తేంటి! ఆయన పదేళ్లుగా మేనేజర్‌గా చేస్తున్నాడట! ఎక్కడైనా ఉద్యోగులు హడలిపోవాల్సిందేనంట! అన్ని వివరాలు కూపీలాగాను'' చివరి చుక్క కాఫీని ఆస్వాదిస్తూ చెప్పాడు ధనుంజయ్.

''వామ్మో... మొదటిరోజే ఎంత షాకిచ్చాడు. రేపటి నుంచి ఇంకెంత క్రమశిక్షణగా వుండమంటాడో? చివరకు బాత్‌రూమ్‌కు వెళ్లడానికి కూడా పర్మిషన్ తీసుకోమంటే ఇంకేమైనా వుందా? నాకైతే ఈ ఉద్యోగం మానేయాలనేంత వైరాగ్యం కలిగింది'' మనోహర్ ఎంతో బాధగా చెప్పాడు.

రేపటి రోజును ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధం కావాలన్న నిర్ణయంతో అంతా తమ తమ ఇళ్ల దారి పట్టారు.

★★★

మరుసటి రోజు మొదటి రోజుకు కాస్త భిన్నంగా వుంది. అందరూ అర్ధగంట ముందే వచ్చారు. ఖచ్చితమైన సమయానికి రంగనాథం ఆఫీసు గుమ్మంలో కాలుపెట్టాడు. అందరి విషెస్‌నూ గంభీరంగా తల ఊపుతూ తన ఛాంబర్‌లోకి వెళ్లాడు. అతని పాటు సూట్‌కేస్‌తో లోపలకి వెళ్లాడు జీవన్.

ఐదునిమిషాలు గడిచాక ఓ చార్ట్‌తో బయటకొచ్చి, సిబ్బంది మొత్తానికి అది కనిపించేలా గోడపై అంటించాడు జీవన్.

''ప్రియమైన సిబ్బందికి మేనేజర్‌గా నా ఆజ్ఞ.... అందరూ క్రమశిక్షణతో వుండి సమయపాలన పాటించాలి. ఆఫీసుకు ఎన్ని నిమిషాలు ఆలస్యమైతే అన్ని 'బింగుళ్లు' (గుంజిళ్ళు) తీయాలి. అలాగే ఆకస్మిక సెలవులు పెట్టేవారికి మిగతా సిబ్బంది తలా ఐదు 'ముక్కుచెంపలు' వేయాలి. ఇక ఫ్రెంచ్ లీవ్ తీసుకొన్నవారికి ఆరోజు జీత నష్టంతో పాటు, అర్ధగంటపాటు 'గోడకుర్చీ' పనిష్మెంటు వేయడం జరుగుతుంది.''

ఇట్లు, మీ గౌరవనీయ మేనేజర్, రంగనాథం.

చార్ట్ పైన మేటర్ చదవగానే మూర్ఛ వచ్చినంత పనైంది. తమాయించుకొని, బాధను దిగమింగుకుని, అత్యంత కష్టంగా ఆ రూల్స్‌కు మనసులోనే అనుమతినిచ్చారు.

ఒకరోజు ధనుంజయ్ ట్రాఫిక్‌లో ఇరుక్కుని అరగంట ఆలస్యంగా వచ్చాడు. ఫలితం...... ముప్పై బింగిళ్లు! మోకాళ్లు పట్టుకొని సాయంకాలం దాకా సీట్లోంచి లేవలేకపోయాడు.

ఇంకొకనాడు మనోహర్ వంతు. ఆఫీస్‌లో వుండగా అర్జంట్ కాల్ వచ్చింది. ఉన్న ఫళంగా వచ్చేయమని. వెళ్లి సెలవిమ్మని రంగనాథాన్ని అడిగాడు. ''వెళ్లు మనోహర్.. నీకిప్పుడే సెలవు మంజూరు చేస్తున్నాను. కానీ, రూల్స్ తెలుసుగా?...'' అర్థోక్తిలో ఆగాడు.

పంటి బిగువున బాధను ఆపుకుంటూనే...''తెలుసు సార్'' అంటూ బయటకి వచ్చాడు. వెనకాలే రంగనాథం కూడా వచ్చి మనోహర్ ఆకస్మిక సెలవు పెడుతున్నాడ ని చెప్పాడు. బాస్ చూస్తుండగా మెల్లగా వేయడం కుదరక, కాస్త గట్టిగానే మనోహర్‌కు ముక్కుచెంపలు తగిలించారంతా. చెంపలు ఎర్రగా అయ్యాయి. వాటిని రుద్దుకుంటూనే తల దించుకొని వెళ్లాడు మనోహర్. సాయంకాలం అందరూ మనోహర్‌కు క్షమాపణ చెప్పారు. మనోహర్‌కు వారిపై కోపం లేదు. కోపమల్లా రంగనాథం పైనే.

ఇంకోసారి... పండగ సెలవులకు స్వంత ఊరెళ్లిన వీరాచారి పండగ అయిపోయాక ఇంకో రోజు ఉండవలసి వచ్చింది. సెల్, ల్యాండ్ ఫోన్ అక్కడ పనిచేయకపోవడంతో సెలవు మంజూరు చేయమని రంగనాథాన్ని రిక్వెస్ట్ చేయలేకపోయాడు. ఫలితం, అతని ఖాతాలో ఫ్రెంచ్ లీవ్ యాడ్ అయింది.

ఆఫీసుకొచ్చాక గోడ కుర్చీ వేసి, అదే పొజిషన్‌లో కంప్యూటర్ డేటా ఎంటర్ చేశాడు. వీరాచారికి ఎంతో సిగ్గుచేటనిపించింది.

ఇక ఆరోజు సాయంత్రం అందరూ కాఫీ షాపులో మీటయ్యారు. రంగనాథం బారి నుంచి తప్పించుకునే ఉపాయం కోసం తీవ్రంగా ఆలోచించాలనుకున్నారు. వాళ్లతో పాటు జీవన్ కూడా ఉన్నాడు.

''సార్... మీరేం వర్రీ కాకుండ్రి. బాస్ ఊక్ పాయింట్లు పట్టుకుందాం. తొందర్లోనే జోరు

తగ్గిద్దాం'' అన్నాడు.

''ఏమోరా... ఆ బాధ్యత నీదే! మాకీ ఇబ్బందులు తప్పించావంటే నీ రుణం ఉంచుకోం. పండుగలకు పబ్బాలకు బక్షీసు ఇస్తాములే.'' ముక్త కంఠంతో అన్నారంతా. అభయమిస్తున్నట్లు చెయ్యెత్తి దీవించాడు జీవన్.

★★★

దీపావళి పండుగ ఇంకో రెండ్రోజులుంది.

ఆఫీసుకు రాగానే జీవన్ చేతిలో ఓ లిస్ట్ పెట్టాడు రంగనాథం. అందులో బాణాసంచి వివరాలున్నాయి. జేబులోంచి పదివేల కట్ట తీసి జీవన్ మరో చేతిలో పెట్టి ఓ గంటలో లిస్ట్‌లోని వన్నీ తెమ్మని ఆర్డరేశాడు రంగనాథం.

ఆ లిస్ట్ చదవగానే జీవన్ మతిపోయింది. లక్ష్మీ బాంబులు, తాటాకు బాంబులు, బుల్లెట్ బాంబులు అన్నీ భయంకర శబ్దాలనిచ్చేవే! కాకర పూలు, చిచ్చుబుడ్లు, మతాబులు, వెన్నముద్దలు, పాము బిళ్లలు, విష్ణుచక్రాలు, భూచక్రాలు లాంటివి భూతద్దం వేసి చూసినా కనిపించలేదు.

ఏమైనా తన కోపానికి తగ్గట్టుగానే తన స్థాయిలో పట్టీ రాశాడనుకున్నాడు జీవన్.

మార్కెట్‌కు వెళ్లి ఓ గంట తర్వాత ఆటోలో ఓ బస్తాడు బాణాసంచా వేసుకొచ్చాడు. ఛాంబర్‌లోకి వెళ్లి, ''సార్.. ఇల్లెక్కడో చెబితే వెళ్లి వాటిని పెట్టి వస్తాను...'' అన్నాడు జీవన్.

రంగనాథం ఇంతవరకూ తాను ఏ కాలనీలో, ఏ ఇంట్లో వుంటున్నాడో అడ్రస్ ఎవరికీ చెప్పలేదు.

''నో.... సాయంత్రం ఇంటికెళ్లేటప్పుడు వాటిని తీసుకెళతాను'' అన్నాడు.

జీవన్ ఆయన చెప్పినట్లే బస్తాను ఆటోలోంచి దించి ఆఫీసులో ఓ మూలగా పెట్టాడు. అప్పటి వరకూ ఏమీ తెలియని సిబ్బందికి టపాసుల వివరాలన్నీ చెప్పాడు జీవన్.

గోతం నిండా బాంబులన్నాయనే సరికి అందరూ సైలెంట్ అయిపోయారు. ఏదైనా తేడా వస్తే టపాకాయలతో పనిష్మెంట్ ఇస్తాడేమోనని భయం మరి!

సాయంకాలం రంగనాథం వాటిని ఇంటికి తీసుకెళుతున్నప్పుడు కూడా అందరూ భయం భయంగా చూశారు వాటిని! దీపావళి రోజు పిలిచి ఒట్టిచేతుల్తో బాంబులు కాల్చమనడు కదా! అని భయపడ్డారు.

★★★

దీపావళి సంతోషంగా గడిచింది.

రంగనాథం ఎవరినీ తన ఇంటికి పిలవలేదు.

మరుసటి రోజు ఆఫీస్ టైమ్‌కు అర్ధగంట ముందే వచ్చాడు జీవన్. సిబ్బందంతా ఎప్పుడు వస్తారా.... వారికి సంతోషకరమైన వార్తను ఎప్పుడు చెప్పాలి? అని ఎదురు చూడసాగాడు.

రంగనాథం రాకముందే అందరూ వచ్చేశారు. జీవన్ తన పొట్ట ఉబ్బరం తట్టుకోలేక అందరి చెవుల్లోనూ ఆ పరమ రహస్యాన్ని ఊదేశాడు. అది విన్నాక వారి ముఖాల్లో చెప్పలేనంత రిలీఫ్! రంగనాథాన్ని ఒక ఆట ఆడించవచ్చన్న ధైర్యం కలిగింది.

''ఇంత మంచి వార్త చెప్పినందుకు నా నోట్ని తీపి చేయరా?'' గోముగా అడిగాడు జీవన్.

''ఇప్పటికప్పుడు తీపంటే ఎలారా? లంచ్ టైంలో చేద్దాంలే!'' అన్నారు.

''ముందో వంద కొట్టండ్రి'' అని జీవన్ అనడం ఆలస్యం అందరి చేతుల్లోనూ రెండేసి వందలు ప్రత్యక్షమయ్యాయి. వాడికి ఎంత ఇచ్చినా రుణం తీరనిదని వాళ్ల అభిప్రాయం!

ఆనందంగా ఆ డబ్బు తీసుకొని, ''ఉదయాన్నే స్వీట్ షాప్ తీయరని తెలిసే రాత్రి కొని దగ్గర పెట్టుకున్నాను.'' అంటూ పుల్లారెడ్డి స్వీట్ పాకెట్ సంచీలోంచి తీసి తనొక ముక్కతిని మిగతావి పంచాడు జీవన్.

''ఇంతకీ ఈ కీలకమైన విషయం ఎలా తెలుసుకున్నావురా?'' ఆత్రం పట్టలేక అడిగాడు మనోహర్.

''ఏం లేదు సార్... బాస్ బాంబుల్ని ఎంత బీభత్సంగా కాలుస్తాడో చూద్దామనుకున్న... ఆ బాంబుల్ని నేనే కొట్టినట్టు ఫీలవుదామని బాస్‌ను రహస్యంగా ఫాలో అయిన! ఇల్లు కనిపెట్టిన!... ఇగ, దీపావళి రోజున ప్రహరిగోడ మీంచి సార్ గాల్చుడు చూద్దామని ఓ కన్నేసిన. సార్ గాల్చలె! ఇసిత్రంగా మేడమ్ గారు కాకరపూల్ గాల్చినట్లు బాంబుల్ గాల్చి ఇసిరేయ్‌బట్టింది. బాసేమో సావు కేకలు బెట్టుకుంట లాన్ మొత్తం సిందులు తొక్కిండు. కాల్చుడు ఆపమని, భయమవుతుందని ఏడ్సుకుంట మేడమ్ కాళ్లు బట్కొని దండం గూడ బెట్టిండు! బాస్ గట్ల అడిగేకొద్దీ మేడమ్ మరింత రెచ్చిపోయి బాంబుల్ని బాస్ మీదకే ఇసరబట్టింది. మస్తు ఖుషీ అయింది.

ఇగ గసుంది మొదలు సార్ ఈక్వాయింట్ తెలిసిపాయె! 'ధూం...దాం' ఆఫీసులో మనమీదనేగ అని, 'ధాం...ధాం' వినబడితే పరారైతాడని...''

జీవన్ మాటలకు అందరూ హాయిగా నవ్వుకున్నారు. ఏం చేయాలో ఐదునిమిషాల్లో నిర్ణయించుకుని, ఆ పనిని జీవన్‌కు పురమాయించారు.

రంగనాథం వచ్చాడు. ఓ గంట గడిచాక ఆకస్మిక సెలవు కొరకు, అన్నట్లుగా ధనుంజయ్ ఛాంబర్‌లోకి వెళ్లాడు. ఎప్పటి లాగానే అందరిచేతా ముక్కు చెంపలు వేయించుకోవాలన్నాడు రంగనాథం.

ధనుంజయ్ లోపలకు వెళ్లిన వెంటనే మనోహర్ జీవన్‌కు సైగ చేశాడు. జీవన్ మెరుపు వేగంతో వెళ్లి ఆఫీస్ ఎంట్రన్స్‌లో దోసకాయ సైజున్న టపాకాయ వత్తికి నిప్పు ముట్టించి ఆఫీసులోకి వచ్చేశాడు.

ఒకటి, రెండు మూడు క్షణాలు...

'ధాం' అంటూ పెద్ద పేలుడు.

ఆ శబ్దానికి ఛాంబర్‌లోని రంగనాథం ఒళ్లంతా వణికింది. చెమటలుపట్టేశాయి. పనిష్మెంటు సంగతి మరిచిపోయి ధనుంజయ్ సెలవిచ్చాడు. ఒంట్లో వణుకుడు సాయంకాలం దాకా తగ్గలేదు. సాయంకాలం ఐదు దాకా తన రూమ్‌లోంచి బయటకు వస్తే ఒట్టు!

ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్లే ముందు పులిలాంటి రంగనాథం పిల్లిలా మారి, 'జీవన్... నువ్వు నా వెంటే వుండి, మా ఇంటి వరకు వచ్చేయ్. అవునూ ఉదయం పేలిన బాంబు ఎక్కడిది? మన స్టాఫ్ ఏమైనా కాల్చారా?' అని అడిగాడు.

''లేదు సార్... ఎవరో రోడ్డు మీద కాల్చారు...'' అంటూ బ్యాగ్ పట్టుకొని ఆయన వెనకాలే నడిచాడు జీవన్. మనోహర్, వీరాచారి ముఖాన నవ్వులే నవ్వులు.

అవి మొదలు టపాకాయలు నిల్వ వుంచుకొని అవసరమైనప్పుడల్లా పేల్చసాగారు. వాటి శబ్దమంటేనే గడగడలాడే రంగనాథం భయంతో, వణుకుడుతో తన పనిష్మెంట్లను మరిచిపోయాడు. ఎక్కడ ఏ బాంబు పేలుతుందోనని చుట్టు పక్కల చూసుకోవడమే సరిపోయింది ఆయనకు!

బాసు టపాసు భయం వింత శిక్షల నుంచి కొన్ని ప్రాణాలను రక్షించింది మరి!

★

